www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 2 సెప్టెంబర్ 2024

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు

నేడు సెలవు: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 2వ తేదీ సోమవారం తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాతావరణశాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు జూనియర్ కళాశాలలకు ప్రభుత్వ శెలవు దినంగా ప్రకటిస్తూ, ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ విధిగా పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ఆదేశించారు.

ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ పరీక్షలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆదివారం జరిగిన యూపీఎస్సీ నేషనల్ డిఫెన్స్ అకాడెమీ అండ్ నావల్ అకాడెమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ 2024 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 2 నుండి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో యూపీఎస్సీ నేషనల్ డిఫెన్స్ అకాడెమీ అండ్ నావల్ అకాడెమీ పరీక్ష నిర్వహణ జరిగిందనీ, తిరుపతిలో నిర్వహించిన 2 పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలకు 495 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఉదయం పేపర్ 1 పరీక్షకు 248 మంది 50.10శాతంగా, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షకు 255 మంది 51.52 శాతం మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. అలాగే యుపిఎస్సి కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ 2024 పరీక్షలు ఉదయం 9 నుండి 11 గంటల వరకు, మద్యాహ్నం 12 నుండి 2 గంటల వరకు, మద్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు మూడు సెషన్లలో జరిగాయని ఈ పరీక్షలకు మొత్తం 326 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి సెషన్లో 132 మంది 40.49 శతం, రెండవ సెషన్లో 132 మంది 40.49 శాతం, మూడవ సెషన్లో 75 మంది 41.44 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి బందోబస్తు నడుమ సంబంధిత పరీక్ష కేంద్రాలకు తరలించడం జరిగిందని, అభ్యర్థులకు పరీక్ష కేంద్రంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని తెలిపారు.కేంద్ర యుపిఎస్సి నిబంధనల మేరకు అన్నివిధాల పకడ్బందీ చర్యలు చేపట్టి పరీక్షలు నిర్వహించామని, అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

రోడ్డుపై తట్టా బుట్టలతో నిరసన

- 12 రోజూ కొనసాగిన దీక్ష

ప్రజాశక్తి- తిరుపతి సిటీ, తిరుపతి టౌన్: శ్రీవారి మెట్లు వ్యాపారస్తులు ఆదివారం వినూత్న రీతిలో తట్టబుట్టతో నిరసన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు తమ సమస్యలను పరిష్కరించాలని గత 12 రోజులుగా టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా నిరసన దీక్ష నిర్వహిస్తున్న విషయం విధితమే. శ్రీవారిమెట్ల పైన చేస్తున్న వ్యాపారాలు సమోసాలు, మజ్జిగ, కడియాలు, పండ్లు, బొరుగులు, మామిడికాయలు, మామిడి తాండ్రలు, జ్యూసులు, కూల్డ్రింకులు, ఇలా అనేక రకాలైన బుట్టలో పెట్టుకొని అమ్ముతూ వారి కుటుంబ సభ్యులతో సహా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి. బాల సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర మాట్లాడుతూ నేటికీ 12రోజులు నిరసన దీక్ష జరుగుతున్న టిటిడి యాజమాన్యం పట్టించుకోకుండా పోవడం చాలా దారుణమన్నారు. స్పందించాల్సిన అధికారులు ఇప్పటివరకు మీ సమస్య ఏది అని మాట్లాడలేదు. దాదాపు 31 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. దీని మీద ఆధారపడి, వాళ్ళ బిడ్డల చదువులు, ఆరోగ్యాలకు సంబంధించినటువంటి జీవనోదారాలు అన్నీ కూడా ఈ మెట్ల ద్వారా భక్తులకు సేవ చేస్తూ, జీవనం కొనసాగిస్తున్నారు. గత 20 సంవత్సారాల నుండి శ్రీవారి మెట్లు నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారు కాబట్టి వీరికి తక్షణమే న్యాయం చేయాలని టిటిడి అధికారులు కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు గండికోట నాగ వెంకటేష్, జిల్లా కార్యదర్శి మునిరాజా, నగర ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్, బుజ్జి, ముఖేష్, మురళి, శ్రీవారి మెట్టు వ్యాపారస్తులు యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున, గిరి, లోకనాథం, చిరంజీవి, నరసింహ, సోను, మొగులప్ప, రాంబాబు, గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ నిలిపివేయాలి

ఏఐబీ ఈఏ జాతీయ కార్యదర్శి బిఎస్ రాంబాబు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయడం నిలిపివేసి ప్రభుత్వపరంగా నడపాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి బిఎస్.రాంబాబు కోరారు. ఆదివారం ప్రైవేట్ హోటల్లో తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమన్వయం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐబి ఈఏ జాతీయ కార్యదర్శి రాంబాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశానికి పెనుప్రమాదం పొంచి ఉందన్నారు. జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ వల్ల ఖాతాదారుల డిపాజిట్లకు భద్రత ఉండదని పేర్కొన్నారు. లాభాల్లో ఉన్న జాతీయ బ్యాంకులు ప్రైవేట్ కంపెనీ చేతుల్లో పెడితే నష్టాలే తప్ప లాభాలు ఉండవని అన్నారు. జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణను దేశ ప్రజలందరూ ఐక్యంగా ఉండే అడ్డుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యదర్శి వి.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకులు ఉండడం వల్ల రైతులకు విద్యార్థులకు సామాన్య ప్రజలకు రుణాలు మంజూరు అవుతాయని ప్రైవేట్ బ్యాంకుల వల్ల ఎన్నో షరతులు పెట్టి రుణాలు సక్రమంగా ఇవ్వరని పేర్కొన్నారు. ఏపీ అండ్ టిబిఎఫ్ కార్యదర్శి కె.రమాప్రసాద్ మాట్లాడుతూ బడా వ్యాపారస్తులు రుణాలు తీసుకుని దేశం విడిచి పారిపోయారని వారి ఆస్తులు స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు ధన్వంత్ కుమార్, జనార్ధన్, సుమలత, రేష్మ, నిర్మల దేవి, యజ్ఞేశ్ బాబు, నందగోపాల్, కేశవరెడ్డి, ఉమా మహేష్, లక్ష్మీపతి పవన్, వెంకట్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూ వ్యవస్థాపక దినోత్సవం

కాంతుల వెలుగులో ఎస్వీయూ పరిపాలన భవనం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని 1954 సెప్టెంబర్ 2వ తేదీ స్థాపించారు. నేడు 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకోవడానికి సర్వం సిద్ధం చేయడం జరిగిందని బోధనేతర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ బోధనేతర సంఘం ఆధ్వర్యంలో మొట్ట మొదటిసారి 1984వ సంవత్సరంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించుటకు అప్పుడున్న అధికారుల అనుమతితో దిగ్విజయంగా జరుపుకుంటూ నేటికీ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బోధనేతర సంఘం ఆధ్వర్యంలోనే కొనసాగించడం జరుగుతుందన్నారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉద్యోగస్తులకు క్రీడలను, సాంస్కృతిక పోటీలను నిర్వహించి గెలిచిన వారికి బహుమతులను ఇవ్వటం, 2023-24 వరకు పదవి విరమణ పొందిన బోధనేతర ఉద్యోగస్తులను ఘనంగా సత్కరించడం జరుగుతుందని చెప్పారు. ఈసారి కూడా పెద్దసంఖ్యలో ఉత్సాహంగా ఉద్యోగులు క్రీడలలో అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల వారికున్న అభిలాషని చాటుకున్నారు. ఈసారి మహిళలు ఎక్కువగా క్రీడలలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

2వ తారీఖున ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించి, మా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. సాయంకాలం 4.30 గంటలకు శ్రీనివాస ఆడిటోరియంలో ఆహ్లాదకర వాతావరణంలో కార్యక్రమాన్ని జరుపుకొనుటకు సర్వం సిద్ధం చేయడం జరిగింది. విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది అలాగే అధికారులు ఎల్లవేళలా కృషి చేస్తున్న వారందరికీ పేరుపేరునా మా సంఘం తరఫున ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు.

మెడికల్ క్యాంపు విజయవంతం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్స్ తిరుపతి ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించి ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. తిరుపతిలోని ప్రముఖ నారాయణద్రి హాస్పిటల్ వారిచే 10 మంది వివిధ విభాగాల్లో నిష్ణాతులైన ప్రముఖ డాక్టర్లు, సిబ్బందితో 1000 మంది వాకర్స్‌కు రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా విచ్చేసినారు. వాకర్స్ అసోసియేషన్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, అధ్యక్షులు వెంకట రెడ్డి, కార్యదర్శి గోపినాథ్ అధ్యక్షతన ఎమ్మెల్యే వైద్యశిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పార్కులోని సమస్యల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు, ఆయన స్పందిస్తూ తప్పకుండా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. తిరుపతిలోని అన్ని పార్కులలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలియజేశారు. కోశాధికారి వి.జగన్నాధం, బెల్లంకొండ సురేష్, ఆస్టర్ నారాయణాద్రి ప్రతినిధులు డాక్టర్ శ్రీధర్ ముని, ఆనంద్ పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): పాత పెన్షన్ విధానానమే ముద్దు అని నినదిస్తూ తిరుపతి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ఏపీ సిపిఎస్ యుఎస్ సంఘం ఆధ్వర్యంలో సిపిఎస్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రేగంటి దేవానంద్, జిల్లా ట్రెజరర్ రెడ్డిరాణి, మహిళ అధ్యక్షురాలు మంజుల, శివకుమార్, రమేష్ యాదవ్, మణి, శ్రీను, ఎల్లయ్య, కిషోర్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బాబు మాట్లాడుతూ అన్యాయమైన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి అందరికి ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివకుమార్, చంద్రశేఖర్, శివప్రసాద్, కోటేశ్వరరావు, మురళి, లోకానాథం పాల్గొన్నారు.

సీపీఎస్ వెంటనే రద్దు చేయాలి: ఎస్టియు

తిరుపతి టౌన్: ఎస్టియు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం విజయవంతంగా జరిగినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జగన్నాథం తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పిలుపు మేరకు జరుగుతున్న ఈనిరసన కార్యక్రమానికి మాజీ శాసన మండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయుల పక్షపాతి ప్రభుత్వంగా వ్యవహరించాలంటే వెంటనే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.ధనంజయ నాయుడు, అధ్యక్షులు రమేష్ బాబు, ఆర్థిక కార్యదర్శి కటారి మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తిరుపతి డివిజన్ కన్వీనర్ సి.వాసు, మంచినీళ్ళ వెంకటరమణ, జిల్లా అదనపు ప్రధానకార్యదర్శి దేవేంద్ర పెరిమిడి, రాష్ట్ర నాయకులు యువశ్రీ మురళి, మురళి, రామాంజనేయులు, మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

'జూ' సందర్శకులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం..

త్వరలో తెల్ల పులుల సఫారీ.. జూ క్యూరేటర్ సెల్వం

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో సందర్శనకు వచ్చే వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని జూక్యూరేటర్ సెల్వం తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో జంతువుల రక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టారన్న అంశాలను వెల్లడించారు.

ప్రజాశక్తి: ప్రస్తుతం జూ లో ఎన్ని రకాల జంతువులు ఉన్నాయి?.

అధికారి: ప్రస్తుతం శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శన శాలలో 85 రకాలకు చెందిన వన్యమృగాలు, పక్షులు, పాములు వంటివి 1100 వరకు ఉన్నాయి. ప్రతిరోజు జూ పార్కు సిబ్బంది వాటికి ఏర్పాటు చేసిన నివాస ప్రాంతాల వద్దకు వెళ్లి వాటి స్థితిగతులను పరిశీలించడం జరుగుతుంది. ఏదైనా జంతువుకు అనారోగ్యంగా ఉండి గుర్తించిన వెంటనే సంబంధిత వెటర్నరీ వైద్యులు చేత ఆ జంతువుకి చికిత్స చేయిస్తాం.

ప్రజాశక్తి: సీసీ కెమెరాల పర్యవేక్షణ ఎలా ఉంది?

అధికారి: జూలో గతంలో 60 సీసీ కెమెరాలతో జంతువుల సంరక్షణ కేంద్రాల వద్ద నిఘా ఏర్పాటు చేశాం. కానీ సందర్శకుల రక్షణలో భాగంగా మరిన్ని సీసీ కెమెరాలు అవసరమని గుర్తించి 25 కెమెరాలను అదనంగా జూ పార్కు పరిధిలో వివిధ ప్రాంతాలన అనుసంధానం చేస్తూ కెమెరాలను ఏర్పాటు చేశాం. జూ లో అమర్చిన సీసీ కెమెరాల వీడియోలను రెండు మానిటరింగ్ గదులను ఏర్పాటు చేసి వాటి ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోంది.

ప్రజాశక్తి: త్వరలో తెల్ల పులుల సఫారీ అమలు చేస్తారా?

అధికారి: ఎస్వి జూ పార్కులో త్వరలో వైట్ టైగర్ సఫారీను తిరిగి త్వరలోనే ప్రారంభిస్తున్నాం. 2018లో వైట్ టైగర్ సఫారీ ఏర్పాటు చేసాం. కరోనా కారణంగా టైగర్ సఫారీ తాత్కాలికంగా ఆపాం. ఇందుకోసం 85 లక్షల రూపాయలు ఖర్చవుతుందని, నాక్ టర్నల్ (రాత్రిపూట తిరిగే జంతువులు, పక్షులు) ఎన్ క్లోజర్ పనులు ఇప్పటికే ప్రారంభమైంది. సందర్శకులను మరింతగా ఆకర్షించడానికి జిరాఫీలను తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం.

ప్రజాశక్తి: జూ వార్షిక బడ్జెట్ ఎంత?.

అధికారి: జూ నిర్వహణకు ఏడాదికి దాదాపు పది కోట్ల రూపాయల వ్యయం జరుగుతుంది. ఇందులోనే జూ నిర్వహణ, సిబ్బందికి జీతభత్యాలు, విద్యుత్ ఛార్జీలు, జంతువులకు ఇచ్చే ఆహారం వంటివి ఉంటాయి.

ప్రజాశక్తి: సెంట్రల్ జూ అథారిటీ నుంచి ఏదైనా నిధులు వస్తాయా?.

అధికారి: జూలో రిస్క్యూ ప్రాణులు నిర్వహణ కోసం ప్రతి ఏడు 60 లక్షల రూపాయలు సెంట్రల్ జూ అథారిటీ నిధులు విడుదల చేస్తుంది. ఏడాది బడ్జెట్ తో కలుపుకొని 10 కోట్ల 60 లక్షల రూపాయలతో శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాల నిర్వహణ జరుగుతుంది.

ప్రజాశక్తి: నీటి సమస్య ఉందా?.

అధికారి: ప్రస్తుతం జూలో ఎటువంటి నీటి కొరత లేదు. జూ నిర్వహణకు కళ్యాణి డాం నీటితోపాటు జూ లోపల బోర్లను ఏర్పాటు చేసుకున్నాం. వీటితో జూలో పచ్చదనం నిర్వహణకు, జంతువులకు తగినంత నీటి సదుపాయం ఉంది.

ప్రజాశక్తి: మత్తు పానీయాలు సేవించే వారిని అనుమతిస్తారా?.

అధికారి: శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శన శాలలోకి మత్తు పానీయాలు, మద్యం తాగివచ్చే వారిని గుర్తించడానికి పోలీసులు వినియోగించే బ్రీత్ అనలైజర్‌లను అనుమానం ఉన్న వారిపై వీటితో తనిఖీలు చేయడం జరుగుతుంది. ఇవి సందర్శకుడు జూ లోకి ప్రవేశించే సమయంలోనే సిబ్బంది బ్రీత్ అనలైజర్ ద్వారా లోపలికి వచ్చే సందర్శకుడు మత్తుపానీయాలు తాగి ఉంటే వారిని లోపలికి అనుమతించకుండా బయటికి పంపుతాం.

తెలుగుజాతి అభివృద్ధి ప్రధాత నారా

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: తెలుగుజాతి అభివృద్ధి ప్రధాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసి నేటికి 29 సంవత్సరాలు పూర్తి చేసుకొని, 30 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం నెమళ్ళూరు బుజ్జి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ నగర్ కూడలి వద్ద చంద్రబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను ప్రజలకు వివరించి ప్రజలకు మిఠాయిలు పంచి పెట్టారు. శేఖర్, చెంబేటి బాలయ్య, సులేమాన్, శివ, తేజ, కోటయ్య, రమేష్, సుబ్రమణ్యం, ప్రసాద్, గోపి, లోకేష్, సుధాకర్, ముని, సురేష్, దాము పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు: సుగుణమ్మ

తిరుపతి (మంగళం): అభివృద్ధి చేయడానికి ప్రత్యేక విజన్ ఉండాలని ఆ విజన్ ఉన్న గొప్ప నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తిరుపతి మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయన మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి నేటితో 30 ఏళ్లు అయ్యాయన్నారు. 74 ఏళ్లలో నాలుగోసారి చంద్రబాబు సీఎం పదవిని చేపట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పురోగతిగా నడిపించడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారన్నారు. ఆయన అమలు చేసిన పథకాలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయని కొనియాడారు. ఎంతో నైపుణ్యతతో దూరదృష్టతో ఆలోచించి ఐటీ రంగం అభివృద్ధికి చంద్రబాబు తోడ్పాటు అందించారన్నారు. సురా సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, సురేంద్ర నాయుడు, మునిశేఖర్ రాయల్, మన్యం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలు పటిష్ట పరచాలి: ఐద్వా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

మహిళా రాష్ట్ర ఛైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మిని ఐద్వా జిల్లా అధ్యక్షులు ఎం.జయంతి, నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా మహిళపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయంతి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యాచారాలు నిత్యకృత్యమవుతున్నాయని, బడిలో గుడిలో, పని ప్రదేశాలలో రక్షణ లేకుండా పోతుందని అన్నారు. చట్టాలు పటిష్ట పరిస్తే అత్యాచారాల సంఖ్య తగ్గాలి కానీ పెరుగుతూనే ఉన్నాయని దీనికి కారణం ప్రభుత్వం చట్టాలను సరిగా అమలు చేయకపోవడమే అని విమర్శించారు. ఇంత వరకు దిశ చట్టం యాప్పులకే పరిమితమైందన్నారు. మహిళా పోలీస్ స్టేషన్‌లను మహిళల సమస్యల పరిష్కారంకి ఉపయోగపడేలా చేయాలని, మహిళా చట్టాలను పటిష్ట పరచాలి, పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, స్కూల్స్‌లో కాలేజీల్లో ఆడపిల్లలతో ఎలా మెలగాలో మగపిల్లలకు కౌన్సిలింగ్ తరుచు ఇవ్వాలి, యువతను పక్కదారి పట్టిస్తున్న మద్యం గంజాయి లాంటి మత్తు పదార్థాలను అలాగే పోర్న్ సైట్ లను పూర్తిగా నిషేదించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు సత్యశ్రీ, లీలావతి, రాజ కోమలి పాల్గొన్నారు.

మద్యం షాపు సిబ్బంది నిరసన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మద్యం షాప్ సిబ్బంది తిరుపతిలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి టౌన్ క్లబ్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ మద్యం షాపులలో విధులు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15వేల మందికి పైగా ప్రభుత్వ మద్యం షాపులలో పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే తమకు 35 నుంచి 40 సంవత్సరాలు వయసు ఉందని, మరే ప్రభుత్వ ఉద్యోగానికి వెళ్లే అవకాశం లేదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం, కొత్త మద్యం పాలసీ తీసుకురావడం ద్వారా, ప్రభుత్వ మద్యం షాపులను ప్రైవేటుపరం చేస్తున్నారని, దీని ద్వారా తాము ఉపాధి కోల్పోయి, రోడ్డున పడుతున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ సమస్యను గుర్తించి, తమకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. నగరంలోని ప్రభుత్వ మద్యం షాపులో పనిచేసే సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలస్తీనా పై ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆపాలి: సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ గత కొన్ని నెలలుగా పాలస్తీనాలోని గాజా రాఫా ప్రాంతాలపై సాగిస్తున్న దాడులు మారణ హోమాన్ని తక్షణమే ఆపాలని సిఐటియు తిరుపతి నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గాలు ప్రపంచ మానవాళికి వినాశనంగా మారిందని పాలస్తీనా పై దాడులను ఆపాలంటూ ఐక్యరాజ్యసమితి నాలుగు సార్లు తీర్మానం చేసినా ఇజ్రాయిల్ పట్టించుకోలేదన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాల బేఖాతరు చేసిందని అన్నారు. ఆయుధాలను అమ్ముకునేందుకు అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల మధ్య యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతున్నదని చెప్పారు. ఇజ్రాయిల్ విద్యార్థులకు ఎలాంటి సహకారం అందించొద్దంటూ అమెరికా సహా అన్ని దేశాల్లోని విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. ఇది పాలస్తీనా మీద జరుగుతున్న దాడి కాదని మానవాళి మీద ప్రపంచశాంతి మీద జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు డ్రోన్లు, ఆయుధాలను సరఫరా చేసి పరోక్షంగా ఆ యుద్ధంలో భాగస్వామిగా మారిందని విమర్శించారు. ఆ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.సుబ్రహ్మణ్యం, ఆర్.లక్ష్మి, ఎస్.జయచంద్ర, మునిరాజా, పి.బుజ్జి, రఘు, బాలాజీ, సుందరం, తంజావూరు మురళి, ముఖేష్, యుగంధర్, ప్రసాద్ రాము పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వినాయక చవితి ఉత్సవాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ విశ్వనాథ నాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చవితి వేడుకలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని అనుమతులు పొందాలన్నారు. www.geneshutsav.net వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

చౌకబారు వ్యాఖ్యలు తగదు

- పిచ్చాటూరు టిడిపి నేతలు

విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: నాగలాపురం టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ఉప అధ్యక్షుడు అని చెప్పుకుంటూ కొండూరు బాలరాజు అనే వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై అసత్య ఆరోపణలు నీచమైన, హేయమైన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పిచ్చాటూరు టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రశాంతమైన నియోజకవర్గంలో నీచ రాజకీయాలకు తెరలేపి, క్రమశిక్షణ కలిగిన టిడిపి పార్టీకి కళంకం తెస్తున్నారని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ ఇలంగోవ రెడ్డి దుయ్యబట్టారు. బాలరాజు వ్యాఖ్యలు ఖండిస్తూ.. రాజకీయాల్లో విలువలకు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్న ఎమ్మెల్యేపై అబాండాలు వేయడం తగదన్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడవకముందే, పార్టీ క్రమశిక్షణను ఎవరు ఉల్లంఘించినా అధిష్టానం దృష్టి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసు, రవి, ఢిల్లీ బాబు, మునిశేఖర్, దొరవేలు, బత్తారెడ్డి, ఏగంబరం, ఏసు, శివ, రవి, గోవర్ధన్ పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: నారాయణవనం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదిమూలంపై బాలరాజు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. నాయకులు భాస్కర్, ఆర్‌డి ఏకాంబరం, భాస్కరన్, కే.ఎస్.రవి, వూరప్ప, సుబ్రమణ్యం, హరి, మాణిక్యం, వేలు రెడ్డి, నరేష్, గోవిందచెట్టి, శివకుమార్, రమేష్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణ సమీపంలోని గాంధీనగర్ ప్రైమరీ స్కూల్లో నెల్లూరు వసంత లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిట్స్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు రోగులను పరీక్షించి గర్భవతులకు స్కానింగ్ మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్యాద్రి మాట్లాడుతూ వసంత లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, రిట్స్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. వంద మందికి పైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించడం జరిగిందని పేర్కొన్నారు. డాక్టర్ విజయ, సంపత్ కుమార్, సురేష్, సురేంద్ర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణ సమీపంలోని గ్రామదేవత తాళమ్మ అమ్మవారి దేవస్థానంలో గంగాభవాని నూతన ఆలయ నిర్మాణం పూర్తయింది. కుంభాభిషేకానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కమిటీ సభ్యులు తిరకాల నాగేశ్వరరావు మాట్లాడుతూ గంగాభవాని అమ్మవారి ఆలయం మారు బోయిన సుబ్బారావు దాతృత్వంతో పున:నిర్మించడం జరిగిందని, ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు కుంభాభిషేక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో శ్రీనివాసులు, చెంచయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జేవీవీ లక్ష్యం

గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలను పారదోలి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని జేవీవీ జిల్లా కార్యదర్శి రెడ్డప్ప అన్నారు. స్థానిక వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్లీనరీ సమావేశాలకుపై సమీక్ష, పురోగతిపై చర్చించారు. భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళిక రచించారు. ముఖ్య అతిథిగా హాజరైన రెడ్డప్ప మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సామాజిక అంతరాలు, మూఢ విశ్వాసాలను తొలగించేందుకు జన విజ్ఞాన వేదిక రాజీలేని పోరాటాలు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రత్యేక చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తున్నామని అన్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా పిల్లలకు చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం చెకుముఖి టాలెంట్ టెస్ట్ గోడ పత్రికలను ఆవిష్కరించారు. జెవివీ రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు, గ్రామీణ శాస్త్రవేత్త చంద్రశేఖర్, జెవివి జిల్లా నాయకులు ఎస్ఎం షరీఫ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, చెంగయ్య, కుప్పస్వామి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'భజన మందిర నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు'

ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం (తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ కాలూరు గ్రామంలో నిర్మిస్తున్న శ్రీరామ భజన మందిర నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదని కాలూరు గ్రామ భక్తురాలు చాముండేశ్వరి అన్నారు. ఆలయం వద్ద ఆదివారం ఆమె కాలూరు గ్రామ మహిళలతో కలిసి మాట్లాడుతూ.. 70 ఏళ్ల చరిత్ర ఉన్న గ్రామంలో శిథిలమైన రామాలయాన్ని పున:నిర్మిస్తుండగా అడ్డపడడం సరికాదన్నారు. భజన మందిరం స్థల వివాదాన్ని కలెక్టర్, దేవాదాయ శాఖ అధికారులు చొరవ తీసుకుని పరిష్కరించాలని ఆమె కోరారు.

పుత్తూరు ఎస్ఐగా ఓబులయ్య

ఎస్ఐ ఓబులయ్య

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు ఎస్ఐగా ఓబులయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నాగలాపురంలో పనిచేస్తున్న ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకట మోహన్ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

చంద్రగిరిలో బాలయ్య అభిమానుల సంబరాలు

స్వీట్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): నందమూరి బాలకృష్ణ సినీ రంగంలోనూ ఇటు రాజకీయ రంగంలో ప్రతిభ చాటుతూ సినీ రంగంలో 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగయ్య గారిపల్లికి చెందిన బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు అత్తులూరి నరేష్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో అభిమానులు ఆదివారం చంద్రగిరిలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ నాయుడు అభిమానులకు ఆనందోత్సాల నడుమ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బాలయ్య అభిమానులు లక్ష్మణ రెడ్డి, ఈశ్వర్ రాయల్, బాబు, మునిరాజ నాయుడు, ధనంజయ నాయుడు పాల్గొన్నారు.

రాజీవ్ నగర్ అక్రమాలపై నేడు విచారణ

- ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే వినతి

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజీవ్ నగర్ భూ అక్రమాలపై సోమవారం 57బృందాలతో సమగ్ర విచారణ జరగనుంది. గత వైసిపి హయాంలో నష్ట పోయిన బాధితులు భయం వీడి అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విచారణలో ఎటువంటి రాజకీయ ఒత్తిడిలు ఉండవనీ, నిష్పక్షపాతంగా అధికారులు విచారణ జరపాల్సిందిగా సూచించారు. నిజమైన అర్హులకు, నిరుపేదలకు న్యాయం చేయడమే తమ ఉద్దేశమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

రాయలసీమలో జనసేన పార్టీని విస్తరింప చేయాలి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: రాయలసీమలోని ప్రతి నియోజకవర్గంలో జనసేన పార్టీని విస్తరింప చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. రాష్ట్ర దశ, దిశను నిర్దేశించే ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని ఆయన అన్నారు. జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలు జనసేన నాయకులు వూసా మాధవరావు ఆధ్వర్యంలో తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో ఆదివారం వేడుకగా జరిగాయి. ముఖ్యఅధిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో ఎక్కువ మందిని చేర్పించిన వారికి షీల్డ్ ఇచ్చి సన్మానించారు. ఆరణి మదన్ మోహన్ 1047 మందిని చేర్పించి మొదటి స్థానంలో నిలవగా ఆయన స్థానంలో ఆరణి శివకుమార్ షీల్డ్ అందుకున్నారు. దినేష్ జైన్ 1011 మందని చేర్చి రెండో స్థానంలో రిటైర్డ్ తహశిల్దార్ నరసింహులు నాయుడు 771 మందిని చేర్పించి మూడోస్థానంలో 522మందిని చేర్పించి ఆముదాల వెంకటేష్ రాయల్ నాలుగో స్థానంలో 505 మందిని పార్టీలో చేర్పించి వూసా మాధవ రావు ఐదో స్థానంలో నిలిచి ఎమ్మెల్యే నుంచి షీల్డ్ అందుకున్నారు. జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో రాయలసీమలో తిరుపతి మొదటి స్థానంలో నిలివడం వెనుక జనసైనికుల పట్టుదల సంతోషాన్నిచ్చిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రాయలసీమలోని అన్ని నియోజకవర్గాలకు జనసేన పార్టీని విస్తరింప చేయాలని ఆయన జనశ్రేణులను కోరారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్, ఆరణి శివ కుమార్, కిరణ్ రాయల్, రాజారెడ్డి, కీర్తన, ఆకేపాటి సుభాషిణి, ముక్కు సత్యవంతుడు, నైనార్ శ్రీనివాస్, కార్పోరేటర్ సత్యనారాయణ, రాజేష్ ఆచ్చారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ కొట్టు శ్రీనివాసులు మృతి బాధాకరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: కామ్రేడ్ కొట్టు శ్రీనివాసులు అనారోగ్య కారణంగా శనివారం చనిపోవడం జరిగింది. సిపిఎంలో గూడూరు రూరల్ మాజీశాఖ కార్యదర్శిగా పని చేశారు. డివైఎఫ్ఐ, ప్రజానాట్య మండలి, జిలా ్లస్థాయి నాయకుడిగా పార్టీ కోసం పనిచేశారు. గూడూరు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కొట్టు శ్రీనివాసులు అంత్యక్రియలలో పాల్గొని సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ , వెంకటరామిరెడ్డి,పి, శ్రీనివాసులు , పమంజి మనీ, సురేష్ ,అడపాల ప్రసాద్, సుబ్బయ్య, ఆర్ శ్రీనివాసులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన హరి చౌహాన్ నాయక్

ప్రజాశక్తి - క్యాంపస్: సీఎం చంద్రబాబును టిడిపి నాయకులు మూడే హరి చౌహాన్ నాయక్ శనివారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా గిరిజన సమస్యలపై వినతి పత్రం అందించారు. రాష్ట్రంలో సుమారు 25వేల బ్యాక్లాగ్ పోస్టులను ఖాళీగా ఉన్నాయని, భర్తీ చేయాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు హరి చౌహన్ నాయక్ తెలిపారు.

కుక్కలు బాబోయ్..

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. 28పంచాయతీల్లోనూ వీటి ప్రభావం అధికంగా ఉంది. పెద్ద, చిన్న అందరినీ బెంబేలెత్తిస్తున్నాయి. సైకిల్, బైక్‌లుపై వెళ్లే ప్రయాణికులను వెంబడిస్తున్నాయి. దీంతో అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక గ్రామాల్లో పశువులు, మేకపిల్లలు, కోళ్లు, గొర్రె పిల్లలు, దూడలను వదలట్లేదు. అవకాశం దొరికినప్పుడల్లా పిక్కలుపెరికేస్తున్నాయంతే.. బడికి వెళ్లే పిల్లలు కుక్కల స్వైరవిహారంతో బీతిల్లుపోతున్నారు. ఏ సమయానికి ఏ శునకం దాడి చేస్తుందోనన్న భయాందోళన స్థానికుల్లో కనిపిస్తోంది. ఇంటి నుంచి వీధుల్లోకి రావాలంటే కర్ర, రాయి చేత పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పాడింది. మండల వ్యాప్తంగా ప్రజలు రోజూ కుక్కకాట్లుకు గురవుతున్నా.. అధికారులు, సర్పంచ్‌లు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు పట్టించుకొని కుక్కల బెడద నుంచి రక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని ఎస్వీయూ టెన్నిస్ కోర్టు..

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గత ఒకటిన్నర సంవత్సరం రోజులకు పైగా టెన్నిస్ కోర్టు ఆధునీకీకరణ చేస్తూనే వ్యాయామ విభాగం ఉన్నతాధికారులు కాలం వెళ్ళబుచ్చుతున్నారు. వర్సిటీలో చదువుకునే ఎంతోమంది విద్యార్థులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, అధ్యాపక సిబ్బంది టెన్నిస్ ప్రాక్టీస్ చేసుకోవాలంటే గత రెండు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. ఆధునీకీకరణ పేరుతో సంవత్సరాలకు పైబడి పనులు కొనసాగిస్తూనే ప్రారంభానికి నోచుకోకుండా వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో ఇలాంటివి కోకొల్లలుగా ఉన్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎప్పుడో క్రీస్తుపూర్వంలో వర్సిటీ స్థాపించినప్పుడు ఏర్పాటు చేసిన వ్యాయామశాలలోని పరికరాలు పూర్తిగా తుప్పు పట్టి నాణ్యత లోపించాయని, వాటిని ఆధునికరించడంలో వ్యాయామ విభాగ అధికారులు చొరవ చూపకపోవడం దారుణమన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వ్యాయామ విభాగానికి కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య మాజీ నాయకులు ఎన్.మాధవ్ కృష్ణ డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు, పరిశోధకులకు ప్రతి ఏటా క్రీడా పోటీలను నిర్వహించి, బహుమతులు ప్రధానం చేయాల్సిన విభాగం వాటి బిల్లులు మాత్రం పెట్టుకోవడంలో ఉన్న ఆసక్తి, ఉత్సాహత పోటీలు నిర్వహించడంలో లేకపోవడం దారుణమన్నారు. సంవత్సరంలో ఆగస్టు 15, జనవరి 26వ రెండు స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాల్లో విద్యార్థులకు ఎటువంటి సమాచారం ఇవ్వడం గానీ, ఆహ్వానించడం కానీ లేకపోవడం విద్యార్థులకు జాతీయ జెండా స్టిక్కర్లు అందించడంలో వ్యాయామ విభాగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వర్సిటీ ఉన్నతాధికారులు వ్యాయామ విభాగంలో నిధుల ఖర్చుపై పూర్తిస్థాయిల శ్వేత పత్రం విడుదల చేయాలని మాధవ్ కృష్ణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

గణనీయమైన అభివృద్ధి సాధించిన కేంద్ర విద్యాసంస్థలు

ఆచార్య వైవి రామిరెడ్డి



ప్రజాశక్తి- క్యాంపస్: మాతృదినోత్సవ కార్యక్రమాలలో పాల్గొనడానికి తిరుపతికి విచ్చేసిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుని ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి.రామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో 2014లో వెంకయ్య నాయుడు చొరవతో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ (ఐజర్) సంస్థలు నేడు ఏర్పేడులో వేల కోట్ల రూపాయల ఖర్చుతో సొంత స్థలాలలో నిర్మించిన సువిశాలమైన, ఆధునికమైన భవనాలలోకి మారటం జరిగిందన్నారు. ఈ విద్యాసంస్థలలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని అదేవిధంగా మౌలిక వసతులు, పరిశోధన, అధ్యాపకుల నివాస గృహాలు, విద్యార్థులు, వసతి గృహాలు పూర్తిస్థాయిలో నిర్మించడం జరిగిందన్నారు. వీటి ఏర్పాటు వెనక కృషి ఆయన ఎంతైనా ఉందని ఈ సందర్భంగా వెంకయ్య నాయుడుకి ఏబిఆర్ఎస్ఎం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: వెంకటరమణ హార్ట్, మెటర్నిటీ హాస్పిటల్‌లో 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో జరిగిన ఈ వైద్య శిబిరంలో ఉచితంగా ఈసీజీ, ఆర్‌బిఎస్, ఎకో యుఎస్‌జి, గర్భిణీ స్త్రీలకు ఉచితంగా స్కానింగ్ పరీక్షలు చేశారు. శిబిరంలో 450మందికి ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందించారని హాస్పిటల్ డైరెక్టర్లు సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సి.వెంకటరమణ, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.నిరుపమ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది రోగులు పాల్గొన్నారు.

పాకాలలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



పతాకం ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(పాకాల): రాష్ట్రంలో పాతికేళ్ల పాటు ఎన్డీఏ ప్రభుత్వమే ప్రజా పాలన సాగిస్తుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. ఆదివారం పాకాలలో జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి నాయకులతో పాటు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు గురునాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ పతావిష్కరణను డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దేవర మనోహర్‌లు చేపట్టారు. అనంతరం చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం టిడిపి అధ్యక్షులు సిఆర్ రాజన్, ఎమ్మెల్యే పులివర్తి నానీలకు ఘన స్వాగతం పలికారు. ముఖ్య అతిథులకు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆకేపాటి సుభాషిని, కోట చంద్రబాబు. జెడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, నాయకులు దశరథ నాయుడు, నాగరాజు నాయుడు, సురేష్ నాయుడు పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం: హరినాథరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: "అన్ని కళలకు జానపద కళలు మూలం.. అలాంటి కళలను కాపాగడుకోవాలని విశాలాంధ్ర జనరల్ మేనేజరు పి.హరినాథరెడ్డి కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా స్థాయి ప్రజా చైతన్య జానపద కళా ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హరినాథరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జానపద కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తన చిన్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఏల పదాలు పాడేవారన్నారు. అదేవిధంగా పొలాల్లో పని చేసేటపుడు పాటలు పాడుతూ శ్రమ మరచేవారన్నారు. పొలాల వద్ద పాటలు పాడేదానికి ప్రత్యేకంగా మనుషులు ఉండేవారని హరినాథరెడ్డి తన బాల్య జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గ్రామీణ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సినీ నటుడు కృష్ణ చైతన్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కాలయ్య, అధ్యక్షులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

యూబిఐతో టొయోటా కిర్లోస్కర్ ఒప్పందం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: వినియోగదారుల అనుభవాలను మెరుగుపరచడంతో పాటుగా కారు యాజమాన్య అనుభవాలను క్రమబద్ధీ కరించాలనే తమ నిరంతర ప్రయత్నంలో భాగంగా టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం), వినియోగదా రులకు సమగ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాల ను అందించటం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇం డియాతో భాగస్వామ్యం చేసుకుందని బిజినెస్ హెడ్ శబరి మనోహర్ తెలిపారు. ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ టొయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడానికి ఆకర్షణీయమైన పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. దీనిలో భాగంగా వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన ఏదైనా వాహనాల ఆన్-రోడ్ ధరపై 90శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించను న్నారు. అలాగే యూనియన్ వెహికల్ స్కీమ్ కింద సం వత్సరానికి 8.80శాతం నుండి ప్రారంభమయ్యే ప్రస్తు త వడ్డీ రేట్లతో 84నెలల వరకు సౌకర్యవంతమైన ఈఎంఐ సదుపాయాలను వినియోగించుకోవచ్చు. వీటితో పాటుగా యూనియన్ పరివాహన్ పథకం కింద వాణిజ్య వాహనాల కోసం 60 నెలల వరకు ఫైనాన్సింగ్ అవకాశాలు అందిస్తారని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, "అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటిగా, టయోటా కిర్లోస్కర్ మోటర్‌తో భాగస్వామ్యం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అత్యంత సులభంగా కొత్త వాహనాన్ని కొనుగోలుకు అనుమతిస్తాయి" అని అన్నారు.

మునీర్ బాషా సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మునీర్ బాషా సేవలు ప్రశంసనీయమని న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు అన్నారు. హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు 156వ నెల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన న్యాయవాదులు మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో 156వ నెలలుగా క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఆయన సేవలు మరిన్ని కాలాలు కొనసాగాలని ఆకాంక్షించారు.

మొక్కలు నాటుదాం రండి : దేవర మనోహర్

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా విరివిగా మొక్కలు నాటి ఆంధ్రప్రదేశ్‌ను క్లీన్ అండ్-గ్రీన్ ఆంధ్రగా తయారు చేద్దామని జనసేన పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దేవర మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం చంద్రగిరిలో మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ 56వ పుట్టినరోజును పునస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్నికి శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అడవిలోకి చొరబడుతున్న ముగ్గురు అరెస్టు

పోలీసుల అదుపులో తమిళనాడు వాసులు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): శేషాచలం పరిధిలోని కడప జిల్లా పత్తూరు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం కోసం అడవిలోకి చొరబడుతున్న ముగ్గురు వ్యక్తులను టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్ఎస్ఐలు కే.సురేష్ బాబు, విష్ణువర్ధన్ కుమార్ బృందాలు ఆదివారం తెల్లవారు జామున కడప జిల్లా ప్రొద్దటూరు రేంజిలోని పత్తూరు అటవీ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. నాగేశ్వర కోన చేరుకునే సమయంలో అక్కడ అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు కనిపించారన్నారు. వారిని చిట్టుముట్టి అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారి వద్ద రెండు పిడిలేని ఇనుప గొడ్డళ్లు లభించాయని, ఎర్రచందనం కోసం అడవుల్లోకి వెళుతున్నట్లు అంగీకరించారని తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన వారుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. దీనిపై టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

భాకరాపేట ఘాట్‌లో లారీ బోల్తా..

భాకరాపేట ఘాట్ రోడ్‌లో బోల్తాపడ్డ లారీ

ప్రజాశక్తి - రామచంద్రా పురం (చంద్రగిరి): తిరుపతి- మదనపల్లి జాతీయ రహదారిలో భాకరాపేట కనుమ రహదారిలో ఆదివారం మధ్యాహ్నం అదుపు తప్పి కర్రలు లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. రాయచోటి వైపు నుంచి తిరుపతికి జామాయిల్ కర్రలు లోడ్డుతో వెళుతూ భాకరాపేట కనుమ రహదారిలోని ప్రధాన మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రాజంపేటకు చెందిన లారీ క్లీనర్ నరసింహులు 52 సంవత్సరాలు గాయాలైయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న చంద్రగిరి పోలీసులు రోడ్డుకు అడ్డుగా పడి ఉన్న కర్రలను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. లారీ డ్రైవర్ అతివేగమే ఈ ప్రమాదానికి కారణం అని.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్లై ఓవర్‌పై రోడ్డు ప్రమాదం

- వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: నగరంలోని ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు కపిల్ తీర్థం - తిరుచానూరు ఫ్లైఓవర్‌పై పీఎస్ ఫోర్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఈస్ట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ని అదుపులోకి తీసుకొని, స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రక్త దానం

రక్తదానం చేస్తున్న మెరుపుల మహేష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ఒక్క రోజు ముందే నగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మెరుపుల మహేష్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం రక్తదానం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున, జగదీశ్వర రాజు, దిలీప్, నవీన్, మోనిష్, క్రాంతి, విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

జిమ్ సెంటర్ ప్రారంభం

జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రాంగణంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చేతుల మీదుగా జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి అన్నారు. ఈ జిమ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన తాళ్లూరి ప్రసాద్ నాయుడిని అభినందించారు. కార్యక్రమంలో స్టేడియం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీ దుర్గి పేరి ప్రాథమికోన్నత పాఠశాలలో టిడిపి నాయకులు మున్నెయ్య ఆధ్వర్యంలో రేణిగుంట బాలాజీ హాస్పిటల్ బృందం వారు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రమేష్ యాదవ్, చంద్రారెడ్డి, తిరుపాల్రెడ్డి, కృష్ణవేణి పాల్గొన్నారు.